PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

గురువారం 28-05-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 266 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

## గోదావరిలోకి పరిశ్రమ వ్యర్థాలు.. డిప్యూటీ సీఎం పవన్ ఆగ్రహం

### పర్యటనలో మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

- గోదావరిలో పరిశ్రమ వ్యర్థాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం
- వెంకటనగరం వద్ద ఆంధ్రాపేపర్ మిల్స్ ప్రాంతాన్ని పరిశీలించిన పవన్
- గోదావరిలోకి నేరుగా కలుస్తున్న కాలుష్య వ్యర్థాలు గుర్తింపు
- కలుషిత నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు ఆదేశం
- వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచన
- గోదావరి కాలుష్య నివారణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు ప్రకటన



రాజమహేంద్రవరం: పవిత్ర గోదావరిలో కాలుష్య నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. తూర్పుగోదావరి జిల్లాలో రెండో రోజు పర్యటనలో భాగంగా వెంకటనగరం వద్ద ఆంధ్రాపేపర్ మిల్స్ కాలుష్య వ్యర్థాలు గోదావరిలో కలిసే ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశ్రమ వ్యర్థాలు నేరుగా గోదావరిలో కలస్తుండటంపై డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపాలని అధికారులను ఆదేశించారు. వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని, ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గోదావరి కాలుష్య నివారణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పవన్ ఇప్పటికే ప్రకటించారు. డిప్యూటీ సీఎం వెంట మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితరులు ఉన్నారు. పేజి 2లో ▶

## దేశంలోకి చొరబాట్లు..

### అక్రమ వలసదారులపై ఉన్నతస్థాయి కమిటీ



- అక్రమ వలసలు, చొరబాట్లపై కేంద్రం కీలక చర్యలు
- జనాభా మార్పులపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- రిటైర్డ్ జడ్జి జస్టిస్ ప్రకాష్ నావోలేకర్‌కు కమిటీ బాధ్యతలు
- సభ్యులుగా దుర్గా శంకర్ మిశ్రా, బాలాజీ శ్రీవాస్తవ, డా. షమికా రవి
- దేశ భద్రత, సార్వభౌమత్వానికి జనాభా మార్పులు సవాల్: అమిత్ షా
- మత, సామాజిక వర్గాల జనాభా మార్పులపై సమగ్ర అధ్యయనం
- అక్రమ చొరబాట్ల నివారణలో రాష్ట్రాలు సహకరించాలని కేంద్రం పిలుపు

అక్రమ వలసలు, ఇతర కారణాల వల్ల దేశంలో చోటుచేసుకుంటున్న అసహజ జనాభా మార్పుల ను నియంత్రించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. దీనిపై దర్యాప్తు జరిపేందుకు ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. గతంలో ప్రధాని మోదీ ప్రకటన ఆధారంగా రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో దీనిని ఏర్పాటు చేశామన్నారు. పేజి 2లో ▶

## జగన్ కుటుంబ రాజకీయాలన్నీ రక్త మాంసాలతో నిండినవే: ఎమ్మెల్సీ భూమిరెడ్డి



అమరావతి: జగన్ కుటుంబ రాజకీయాలన్నీ రక్త మాంసాలతో నిండినవేనని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ వాళ్లకు సాయం చేసిన చరిత్ర వైఎస్ కుటుంబానిదని దుయ్యబట్టారు. స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో బ్రిటీష్ వాళ్లకు జగన్ కుటుంబం ఆహారం సరఫరా చేసిందని తెలిపారు. బ్రిటీష్ వాళ్ల మన్ననల కోసం దేశ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా పనిచేశారని రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు. రాజారెడ్డి బ్రిటీష్ సైన్యంలో చేరి వారి కోసం పనిచేయలేదని చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా అని ప్రశ్నించారు. మంగపేట ముగ్గురాయి గనుల కోసం వెంకటనరసయ్యను జగన్ కుటుంబం హత్య చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చే వరకూ రాజారెడ్డి దేశాలు పట్టుకుని తప్పించుకుని తిరిగాడని మండిపడ్డారు. హత్య చేయించటంతో పాటు చేసిన వారికి సుపారీ చెల్లించకుండా మోసం చేసిన చరిత్ర వైఎస్‌దని భూమిరెడ్డి ఆక్షేపించారు. ఇంత ఘన చరిత్ర కుటుంబ నేపథ్యం ఉన్న జగన్.. శాంతి కాముకుడిగా మాట్లాడటం విడ్డూరమని ఎద్దేవా చేశారు.

## ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'



### సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు
### భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం లో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. 2లో

## మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

- సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం
- సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క



2లో



2లో

## రూ.వెయ్యి కోట్ల స్కామ్..

### ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు: హరీశ్‌రావు



- రూ.వెయ్యి కోట్ల భూ స్కామ్ జరిగిందని హరీశ్‌రావు ఆరోపణ
- పెద్దషాపూర్‌లో 170 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటుకు కట్టబెట్టారన్న విమర్శ
- ఆర్డీవో నివేదికకు విరుద్ధంగా తహసీల్దార్ పట్టా భూమిగా నమోదు చేశారన్న ఆరోపణ
- తహసీల్దార్‌ను బదిలీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు
- భూభారతిలో రాత్రికి రాత్రే ఎంట్రీలు చేశారని ఆరోపణ

మిగతాది 2లో

## నరహరి లొంగుబాటు..

### మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ: డీజీపీ సీవీ ఆనంద్



మిగతాది 2లో

## శిరాజ్‌సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

### ఆవిష్కరించిన మాజీ ప్రధాని దేవేగౌడ
### వెంకయ్య తదితర ప్రముఖుల హాజరు



మిగతాది 2లో

# సంపాదకీయం

## ఆదివాసీలను గౌరవించే సంక్షేమం కావాలి!

ఇటీవల ఒడిశాలో వెలుగుచూసిన ఒక దిగ్భ్రాంతికర సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. జితు ముండా అనే వృద్ధ ఆదివాసీ మరణించిన తన సోదరి ఖాతాలోని కొద్దిపాటి డబ్బు కోసం చివరకు ఆమె అస్థిపంజరాన్ని బ్యాంకు దాకా తీసుకురావాల్సి వచ్చింది. పైకి ఇది సాధారణ బ్యాంకింగ్ సమస్యలా కనిపించినా, వాస్తవానికి ఇది చాలా పెద్ద సంక్షోభానికి సంకేతం. నెలల తరబడి మరణ ధ్రువీకరణ పత్రం రాకపోవడం; ఆధార్ లేకపోవడం వల్ల రేషన్ లభించకపోవడం, వృద్ధాప్య పింఛన్ రాకపోవడం; అడుగడుగునా తమ పేదరికాన్ని, అర్హతను నిరూపించుకోవాల్సిన ఒత్తిడి -- ఇవన్నీ కలిసి ఆయన కనీస మానవ గౌరవాన్ని పక్కనపెట్టి వ్యవస్థ ముందుకు రావాల్సిన దయనీయ పరిస్థితిని సృష్టించాయి. ఈ సంక్షోభానికి పరిష్కారం ఆదివాసీలకు హక్కుల ఆధారిత, సార్వత్రిక (యూనివర్సల్) సామాజిక రక్షణను హామీ ఇవ్వడంలోనే ఉంది.

సామాజిక సంక్షేమ పథకాల అమలులో రెండు ప్రధానమైన విధానాలు: 'లక్షిత విధానం' (ఖతీస్త్రవ్ఙఅస్త్ర) జం 'సార్వత్రిక విధానం' (ఖఅఅజవతీయిఖశ్రీఙఎ) ఉదాహరణకు వృద్ధాప్య పింఛన్లనే తీసుకుంటే-- 'లక్షిత విధానం'లో 60 ఏళ్లు దాటిన వారిని గుర్తించాక, ప్రభుత్వ డేటాబేస్‌ల ద్వారా వారి ఆర్థిక స్థితిని అంచనా వేస్తారు. ఆదాయపు పన్ను, ఎక్కువ భూమి, నాలుగు చక్రాల వాహనాలు వంటి సంపద సూచికలు లేనివారిని మాత్రమే అర్హులుగా ఎంపిక చేస్తారు. దీనికి భిన్నమైనది 'సార్వత్రిక విధానం'. ఇందులో ప్రభుత్వం 60 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడికి బేషరతుగా పింఛన్ అందిస్తుంది. పౌరులందరినీ సామాజిక భద్రతా పరిధిలోకి తీసుకురావడమే దీని ప్రధాన లక్ష్యం.

ప్రస్తుతం చాలా పథకాలు 'పేదరిక ఆధారిత లక్షిత విధానం' (్రశీజవతీఎ ్ఖతీస్త్రవ్ఙఅస్త్ర)పైనే ఆధారపడి నడుస్తున్నాయి. ప్రభుత్వాలు దీనిని 'పరిపాలనా సామర్థ్యం' పేరుతో సమర్థిస్తుంటాయి. నిధుల లీకేజీలు తగ్గించి, ప్రభుత్వ సహాయాన్ని అర్హులుగా గుర్తించిన వర్గాలకే పరిమితం చేయాలనేది వారి వాదన. ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలు కూడా ఈ విధానాలను ప్రోత్సహిస్తున్నాయి. ప్రభుత్వ సహాయం 'అర్హులకే' పరిమితం కావాలని భావించే సమాజంలోని ప్రభావశీల వర్గాలు కూడా ఈ లక్షిత విధానాలకే మద్దతు ఇస్తున్నాయి. సిద్ధాంతపరంగా చూస్తే ఈ 'టార్గెటింగ్' విధానం సరైనదిగానే అనిపించవచ్చు. కానీ ఆచరణలో అది చాలా సంక్లిష్టమైన, భారీ పరిపాలనా యంత్రాంగంగా మారుతోంది. ఎందుకంటే 'నిజమైన పేదలు' ఎవరో గుర్తించడానికి ప్రభుత్వాలు ఇప్పుడు విస్తృతమైన డేటాబేస్‌లు, ఆధార్ అనుసంధానం, బ్యాంక్ లింకింగ్, భూమి రికార్డులు, మొబైల్ నంబర్లు, డిజిటల్ ధ్రువీకరణ వంటి వ్యవస్థలపై ఆధారపడుతున్నాయి. ఫలితంగా సంక్షేమ వ్యవస్థలు ప్రజలకు సహాయం చేసేవిగా కాకుండా, డిజిటల్ ధ్రువీకరణ, అర్హత తనిఖీలపై అధికంగా ఆధారపడే యంత్రాంగాలుగా మారిపోతున్నాయి.ప్రభుత్వాలు టార్గెటింగ్‌ను డబ్బు ఆదా చేసే విధానంగా చూపిస్తుంటాయి. కానీ ఈ భారీ డిజిటల్ డేటాబేస్‌ల నిర్మాణం, నిర్వహణ, ధ్రువీకరణ వ్యవస్థలు, సాఫ్ట్‌వేర్ మౌలిక వసతులపై ప్రజాధనం ఎంత ఖర్చవుతోందో చాలా అరుదుగా చర్చకు వస్తుంది. అంతకంటే ముఖ్యంగా, ఈ క్రమంలో ప్రజలు భరిస్తున్న ఖర్చులు పూర్తిగా కనిపించకుండా పోతున్నాయి. ఆధార్ కేంద్రాలకు ప్రయాణాలు, కోల్పోయే కూలి, ఆహార ఖర్చులు, మధ్యవర్తులకు చెల్లింపులు -- ఇవన్నీ పేద కుటుంబాల భుజాలపై అదనపు భారంగా మారుతున్నాయి.దీనికి భిన్నంగా, 'యూనివర్సల్' విధానం చాలా సరళమైనది. ఇందులో వ్యవస్థ ప్రధాన లక్ష్యం ప్రజలను వడపోసి తొలగించడం కాదు; అందరినీ రక్షణ పరిధిలోకి తీసుకురావడం. ముఖ్యంగా చారిత్రకంగా వెనుకబడిన సమాజాల విషయంలో, ఈ సార్వత్రిక విధానం మరింత న్యాయసమ్మతమైనది.

సాధారణ ప్రజలకే ఈ వ్యవస్థలు ఇంత క్లిష్టంగా మారుతుంటే, ఆదివాసీ సమాజాల విషయంలో పరిస్థితి మరింత దుర్భరంగా మారుతోంది. ఎందుకంటే ప్రతి వ్యక్తికి స్థిరమైన డాక్యుమెంట్లు, బ్యాంక్ ఖాతాలు, ఇంటర్నెట్, మొబైల్ కనెక్టివిటీ ఉన్నాయనే ఊహతో డిజిటల్ వ్యవస్థలు పనిచేస్తాయి. కానీ ఆదివాసీల జీవిత వాస్తవాలు చాలా భిన్నంగా ఉంటాయి.

గతంలో ఆదివాసీ సంక్షేమం అనగానే షెడ్యూల్డ్ ఏరియాలు, అడవులు, భూమితో ముడిపడి ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. వలసలు, పట్టణీకరణ, సంప్రదాయ జీవనాధారాలు దెబ్బతినడం, ఉపాధి మార్గాలు మారడం -- ఇవన్నీ కలిసి ఆదివాసీల జీవన భౌగోళికతను మార్చేశాయి. చాలామంది ఆదివాసీలు ఇప్పుడు షెడ్యూల్డ్ ఏరియాలకు వెలుపల, పట్టణాల అంచుల్లో లేదా అనధికారిక కాలనీల్లో అస్థిర జీవితం గడుపుతున్నారు. ఈ మార్పు కేవలం నివాస ప్రాంతాల మార్పుగానే కాక, సంక్షేమ వ్యవస్థలతో వారి సంబంధాన్నే సంక్లిష్టంగా మార్చుతోంది. ప్రస్తుతం అమలవుతున్న 'పేదరిక ఆధారిత లక్షిత విధానాలు' స్థిరమైన చిరునామాలు, భూమి రికార్డులు, ఆధార్ అనుసంధానం, బ్యాంక్ ఖాతాలు వంటి డాక్యుమెంటేషన్‌పై అధికంగా ఆధారపడుతున్నాయి. కానీ వలసలు, అస్థిర జీవన పరిస్థితులు, బలహీనమైన పరిపాలనా గుర్తింపుల కారణంగా అనేక ఆదివాసీ కుటుంబాలకు ఈ డాక్యుమెంట్లను సమకూర్చుకోవడమే కష్టంగా మారుతోంది.

ప్రత్యేకంగా యానాది, చెంచు వంటి సమాజాల విషయంలో ఈ సమస్య మరింత తీవ్రమైంది. భూమి, స్థిరమైన ఉపాధి లేకుండా, చెత్త ఏరుకోవడం వంటి అసురక్షిత పనులపై ఆధారపడుతున్న అనేక కుటుంబాలు ప్రభుత్వం ఊహిస్తున్న 'స్థిరమైన పేద కుటుంబం' అనే పరిపాలనా నమూనాలో సరిపోవడం లేదు. ఫలితంగా, అత్యంత అసురక్షిత పరిస్థితుల్లో ఉన్నవారే సంక్షేమ వ్యవస్థలకు దూరమవుతున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో 'టార్గెటింగ్' కంటే 'యూనివర్సాలిటీ' మరింత కీలకం. సంక్షేమం అనేది భౌగోళికతను కాదు, మనిషిని అనుసరించాలి. ఆదివాసీల హక్కులు వారు ఎక్కడ నివసిస్తున్నారనే దానిపై ఆధారపడి అదృశ్యం కాకూడదు.

# మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.

# వెలుగుమట్ల భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి: కవిత

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కోరినట్లు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తెలిపారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. వెలుగుమట్లతో పాటు వికారాబాద్ జిల్లా కడ్లాపూర్, ట్రిపుల్ ఆర్ బాధితులతో కలిసి గవర్నర్‌ను కలిశామని చెప్పారు.

వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని కోరామన్నారు. కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు జారీ చేసిన భూసేకరణ నోటీసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు తదితర సమస్యలపై బాధితులతో కలిసి గవర్నర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. న్యాయం జరగకపోతే మళ్లీ పోరాట బాట పడతామని కవిత చెప్పారు.

# కర్ణాటక సీఎం మార్పు వార్తలు.. కాంగ్రెస్ క్లారిటీ

కర్ణాటక లో ముఖ్యమంత్రి మార్పుపై వస్తున్న వార్తలను కాంగ్రెస్ అధిష్ఠానం ఖండించింది. అవన్నీ ఊహాగానాలేనని తెలిపింది. దిల్లీలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లతో పార్టీ అధిష్ఠానం మంతనాలు నిర్వహించింది. అనంతరం కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. రాజ్యసభ ఎన్నికలపైనే తమ చర్చ సాగిందని, మరే విషయాన్ని



చర్చించలేదని అన్నారు. నాయకత్వ మార్పుపై తప్పుడు వార్తలు, ఊహాగానాలు ప్రచారం చేయొద్దని సూచించారు. అయితే పార్టీ మీటింగ్‌లో సీఎం పదవి నుంచి తప్పుకోవాలని కాంగ్రెస్ పెద్దలు సిద్ధరామయ్య కు సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాజ్యసభ ద్వారా జాతీయ రాజకీయాల్లోకి వస్తే.. దిల్లీలో మరింత పెద్ద స్థానం ఇస్తామని పేర్కొన్నట్లు తెలిపాయి. ఇతర విషయాలు, పార్టీ సమస్యలు తాము చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే సభ్యత్వం ముగియనుండడంతో ఆయన స్థానంలో సిద్ధును రాజ్యసభకు పంపే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ విషయంపై సిద్ధరామయ్య తన నిర్ణయాన్ని ఇంకా వెలువరించలేదని పేర్కొన్నాయి.

# టేకాఫ్ వేళ విమానంలో పొగలు.. ప్రయాణికుల బెంబేలు!

బెంగళూరు విమానాశ్రయంలో ఇండిగో విమానంలో పొగలు వచ్చిన ఘటన ప్రయాణికుల్లో భయాందోళన రేకెత్తించింది. మంగళవారం సాయంత్రం బెంగళూరు నుంచి చెన్నైకి వెళ్లేందుకు టేకాఫ్ కోసం సిద్ధమవుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో విమానాన్ని నిలిపివేసి.. అందులోని 230 మంది ప్రయాణికులను అత్యవసర




ద్వారాల గుండా సురక్షితంగా కిందికి దించేశారు. ఈ ఘటనకు దారితీసిన కారణాలు తెలియాల్సి ఉంది.

ఈ పరిణామంపై ఇండిగో స్పందించింది. పొగను గుర్తించిన వెంటనే ప్రయాణికుల భద్రత దృష్ట్యా వారందర్నీ ఖాళీ చేయించామని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది క్షేమంగా ఉన్నారని, వారిని టెర్మినల్‌కు తరలించామని పేర్కొంది. అనంతరం ప్రత్యామ్నాయ విమానం ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

## పర్యాటక ప్రాంతాలను సందర్శించండి - ఉద్యోగులకు ప్రభుత్వం ఆదేశం

బిహార్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఉద్యోగులంతా కుటుంబంతో కలిసి ప్రతి మూడు నెలలకోసారి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రదేశాలను సందర్శించాలని ఆదేశించింది. అంతేకాదు.. ఆయా ప్రదేశాలను ఎలా అభివృద్ధి చేయాలనే విషయంపై నివేదికలు సమర్పించాలని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి అన్ని శాఖాధిపతులు, కలెక్టర్లు, ఎస్పీలు సహా ఆయా విభాగాలకు ఇటీవల లేఖ రాసింది.కుటుంబాలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కనీసం రెండు రోజులు (శుక్ర, శని వారాల్లో) పర్యాటక ప్రదేశాలు సందర్శించాలని అందులో పేర్కొంది. కనీసం మూడు ప్రసిద్ధ ప్రదేశాలను సందర్శించి, అక్కడ రాత్రి బస చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఉద్యోగులు తమ సొంత జిల్లా మినహా ఇతర జిల్లాల్లోని పర్యావరణ అనుకూల (ఎకో టూరిజం) లేదా గ్రామీణ పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. అయితే, ఈ టూర్‌కు వెళ్లే సమయాన్ని విధుల్లో భాగంగానే పరిగణిస్తామని స్పష్టం చేసింది.

# శిరాజ్‌సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

మొదటిపేజీ తరువాయి

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్స్ విత్ నరేంద్ర మోదీ' పుస్తకావిష్కరణ కార్యక్రమం దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా జరిగింది. అప్నాపన్ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశానికి అప్నాపన్ పుస్తకాన్ని శివరాజ్ సింగ్ అంకితం చేశారు. దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి, ఆయనతో తన అనుభవాలను ఈ పుస్తకంలో కేంద్ర మంత్రి పొందుపరిచారు. పుస్తకావిష్కరణ అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రైతు కుటుంబం నుంచి శివరాజ్ సింగ్ చౌహాన్ వచ్చారు. 17 ఏళ్ల పాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దేశంలో ప్రముఖ ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ పేరు తెచ్చుకున్నారు. ఉచిత పథకాలకు నేను వ్యతిరేకం. రాష్ట్రాలు తమ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజలకు విద్య, ఆరోగ్యం అందించాలి. మోదీ అంటే 'మేకింగ్ ఆఫ్ ఇండియా డెవలప్‌మెంట్' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు టీడీపీ ఎంపీలు, ఎన్డీఏ నేతలు హాజరయ్యారు.

# దేశంలోకి చొరబాట్లు..

మొదటిపేజీ తరువాయి

జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు ఒక పెద్ద సవాలుగా మారిందని పేర్కొన్నారు. కమిటీకి రిటైర్డ్ జడ్జి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని.. మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై సమగ్ర మూల్యాంకనం నిర్వహించడం.. మత, సామాజిక వర్గాల స్థాయుల్లో జనాభా మార్పుల సరళిని విశ్లేషించడం ఈ కమిటీ పని అని పేర్కొన్నారు. దేశంలో మారుతున్న జనాభా తీరుపై కేంద్రమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. చొరబాట్లను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

# రూ.వెయ్యి కోట్ల స్కామ్..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రూ.వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లో 170 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదని ఆర్డీవో పేర్కొన్న నాలుగు రోజుల వ్యవధిలో అక్కడి తహసీల్దార్ పట్టా భూమిగా ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. రూ.వెయ్యి కోట్ల స్కామ్ జరిగితే.. తహసీల్దార్‌ను బదిలీ చేసి చేతులు దులిపేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, నేతలు ఎల్.రమణ, ముఠా గోపాల్‌తో కలిసి హరీశ్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు.

అంత ధైర్యం తహసీల్దార్‌కు ఎక్కడిది?

"పెద్దషాపూర్‌లో 170 ఎకరాలు ప్రభుత్వ భూమి అని ఆర్డీవో స్పష్టంగా హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. దానికి భిన్నంగా పట్టా భూమిగా పేర్కొంటూ రాత్రికి రాత్రే భూభారతిలో ప్రైవేటు భూమిగా చేర్చారు. ఆర్డీవో ఆదేశాలను ధిక్కరించి ఆర్డర్ ఇచ్చే ధైర్యం తహసీల్దార్‌కు ఎక్కడిది? ప్రైవేటు వ్యక్తులకు భూములను ధారాదత్తం చేస్తే ఆయన్ను కాపాడుతోంది ఎవరు? తహసీల్దార్‌పై గతంలో ఏసీబీ దాడులు జరిగినా చర్యలు తీసుకోలేదు. దీని వెనుక ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడైన వ్యక్తి ఉన్నారు.

భూభారతిలో ఎంట్రీ జరగాలంటే కలెక్టర్, సీసీఎల్ఏ అనుమతి ఉండాలి. దీని వెనుక ప్రభుత్వ పెద్దలు ఎవరున్నారు? ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా శంషాబాద్‌లో రూ.కోట్ల విలువైన 170 ఎకరాల భూమిని కట్టబెట్టే చేసే ధైర్యం తహసీల్దార్‌కు ఉంటుందా? ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరిపించాలి. తహసీల్దార్‌ను డిస్మిస్ చేయాలి. ఆ భూములను వెంటనే భూభారతిలో నిషేధిత జాబితాలో చేర్చాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# నరహరి లొంగుబాటు..

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ: డీజీపీ సీవీ ఆనంద్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి.. తన భార్య దానమ్మతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈమేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. పసునూరి నరహరిని మీడియా ఎదుట ప్రవేశపెట్టిన సందర్భంగా డీజీపీ మాట్లాడారు. నరహరి లొంగుబాటుతో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలిందన్నారు.

"పసునూరి నరహరి స్వస్థలం హనుమకొండ జిల్లా సోమిడి. డిగ్రీ చదువుతున్న సమయంలో మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లిపోయారు. 1982లో అజ్ఞాత దళ సభ్యుడిగా చేరారు. 2017లో కేంద్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందారు. తుపాకులు, మోర్టార్లు, రాకెట్లు, గ్రనేడ్ల తయారీలో ఆయన నిపుణుడు. సాంకేతిక, సంస్థాగత బాధ్యతలను ఏకకాలంలో నిర్వర్తిస్తూనే.. ఆయుధాల ఉత్పత్తి, మరమ్మతు, నిర్వహణకు సంబంధించి మావోయిస్టు కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేవారు. మావోయిస్టు కార్యకలాపాలను నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. తెలంగాణకు చెందిన ముగ్గురు నేతలు.. గణపతి, జాడే సుజాత, వార్త శేఖర్ మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం సాయమందిస్తోంది" అని డీజీపీ తెలిపారు.

# ఇంటింటి సర్వేతో

## 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాల న్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# దుబాయ్‌లో వేలాది మందికి ఉపాధి కల్పించిన ఆకుల నరేష్‌కు ఘన నివాళి

**- అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

వేములవాడ, మే 27, మేకార్తి దినపత్రిక ప్రతినిధి

వేములవాడ పట్టణానికి చెందిన ప్రముఖ మాజీ ప్రవాస వ్యాపారవేత్త ఆకుల నరేష్ కుమార్ అకాల మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. దుబాయ్‌లో ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి అనేక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన నరేష్ కుమార్ ఇటీవల కేదార్నాథ్ యాత్రలో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం వేములవాడలో నిర్వహించిన ఆయన అంత్యక్రియల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ఆయన భౌతిక కాయానికి ఘనంగా నివాళు లర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని



భగవంతుణ్ణి కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆకుల నరేష్ సాధారణ కార్మికుడిగా గల్ఫ్ జీవితాన్ని ప్రారంభించి తాను కష్టపడి పనిచేసే తత్వంతో ఉన్నతమైన స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. దుబాయ్‌లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వాన్ని అందించిన గొప్ప మనసున్న వ్యక్తి అని కొనియాడారు. యువతకు మార్గదర్శకుడిగా నిలిచిన నరేష్ సేవలు చిరస్మరణీయమన్నారు. నరేష్ మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న అనేక కుటుంబాలకు తీరని లోటని దిగ్భ్రాంతినీ వ్యక్తం చేశారు. జీవితంలో పుట్టుక, మరణాలు సహజమని మనకు దూరమైన వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా వారికి నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అంత్యక్రియల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు కుమ్మరి శంకర్, ఇప్పపూల అజయ్, నాయకులు మదాడి గజానంద రావు, ఏనుగు మనోహర్ రెడ్డి, కొండ దేవయ్యతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, జర్నలిస్టులు, కుటుంబ సభ్యులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని ఆకుల నరేష్‌కు చివరిసారిగా కన్నీటి వీడ్కోలు పలికారు.

# అకాల వర్షాలకు తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనాలి.

**- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం.**
**- కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం.**
**- తడిసిన ధాన్యానికి కూడా మద్దతు ధర వెంటనే ఇవ్వాలి.**
**- రైతన్నకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది.**
**- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి.**

మేకార్తి దినపత్రిక మే 27 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

జనగామ నియోజకవర్గంలోని కొను గోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో నిల్వ ఉంచిన ధాన్యం, మొక్కలు నిన్న కురిసిన అకాల వర్షాల తో పూర్తిగా తడిసిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వమే వెంటనే కొనుగోలు చేయాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 1. కొనుగోలు కేంద్రాలను తాను స్వయంగా సందర్శించినప్పుడు బస్తాల కొరత, ధాన్యం లిఫ్టింగ్‌లో జాప్యం, కూలీల సమస్యలు తీవ్రంగా ఉన్నా యని అధికారులకు పలుమార్లు తెలపడం జరిగింది. అలాగే అకాల వర్షాలు వచ్చే సూచనలు ఉన్నాయని ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి తీసుకె ళ్లినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. 2. కొనుగోలు కేంద్రాల్లో కనీసం తార్పాలిన్లు, గోనె సంచులు, రవాణా సౌకర్యాలు వంటి ప్రాథమిక ఏర్పాట్లు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి కేవలం జనగామ నియోజకవర్గానికే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్నది. 3. నెల రోజులుగా రైతులు ధాన్యపు రాశుల వద్ద కాపలా కాస్తూ ఇబ్బం దులు పడుతున్నారని, ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు చేయ కపోవడం వల్లే వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తే పరిస్థితి వచ్చిందని తెలిపారు. రైతు కష్టానికి విలువ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 4. తడిసిన, రంగు మారిన, మొలకెత్తిన ప్రతి గింజను తేమ శాతంతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయా లని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యం పేరుతో మిల్లర్లు, అధికా రులు కలిసి క్వింటాలుకు 4 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తూ రైతు లను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ దోపిడీని వెంటనే



అరికట్టాలని కోరారు. 5. కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు, హమాలీలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యుద్ధ ప్రాతిపదికన రవాణా సౌకర్యాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. 6. మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని కోరుతున్నాం. లేనిపక్షంలో రైతన్నకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# ఇందిరా మహిళా శక్తి భవనాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి

**- స్వయం ఉపాధి రంగాలపై మహిళలు దృష్టి పెట్టాలి**
**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- రాజేశ్వర్ రావు కాలనీలో ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్**





మేకార్తి దినపత్రిక మే 27 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం రాజేశ్వర్ నగర్ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు తమ గ్రామాల్లో నిర్మిస్తున్న నూతన ఇందిరా మహిళా శక్తి భవనాలను సద్వినియోగం చేసుకోవాలని, క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, సమాజంలో జరిగే అన్ని అంశాలపై చర్చించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా గంభీరావుపేట మండలం రాజేశ్వర్ రావు కాలనీలో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర గ్రామైఖ్య సంఘం సభ్యుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ ఇందిరా మహిళా శక్తి భవనాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశాలు నిర్వహించినప్పుడు సమాజంలో జరిగే అన్ని విషయాలపై చర్చించి, ఒకరికొకరు తమ ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. తద్వారా అందరూ సమాజంలో జరుగుతున్న విషయాలపై కొంత మేరకు అవగాహన కలిగి ఉంటారని అన్నారు. గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, దీనిలో భాగంగా మన జిల్లాలో ఇప్పటివరకు 113 భవనాలు నిర్మించడానికి అనుమతులు మంజూరు చేశామని, ఇప్పటివరకు 103 భవనాలు గ్రౌండింగ్ పూర్తి చేసి వివిధ దశల్లో నిర్మాణ పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో రాష్ట్ర స్థాయిలో మన జిల్లా మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో మొట్టమొదటగా రాజేశ్వర్ రావు కాలనీలో మహిళా శక్తి భవనం పూర్తి స్థాయిలో నిర్మించబడి, అందుబాటులోకి వచ్చిందని అన్నారు. తక్కువ సమయంలోనే భవనాన్ని నిర్మించినందుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. వివిధ దశల్లో ఉన్న భవనాల నిర్మాణం సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాలు అంటే కేవలం రుణాలు తీసుకోవడం, చెల్లించడం వరకు మాత్రమే పరిమితం కావద్దని, ప్రతీ విషయం సభ్యులు అవగాహన కలిగి ఉండాలని, స్వయం ఉపాధి రంగాల వైపు దృష్టి పెట్టి ఆర్థికంగా ఎదిగేందుకు స్థిరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతీ సమావేశానికి మండల స్థాయి అధికారులను ఆహ్వానించి వారు అందించే సలహాలను స్వీకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, సర్పంచ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్సి విభాగం చైర్మన్ గా దాసరి శ్యాంసుందర్ నియామకం..

మేకార్తి దినపత్రిక మే 27 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్ గా దాసరి శ్యామ్ సుందర్ నియమితులయ్యారు. న్యూఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యాలయం ఇందిరా భవన్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం సదస్సులో జాతీయ ఎస్సీ విభాగం అధ్యక్షులు రాజ్ పాల్ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జాతీయ కోఆర్డినేటర్ నాగరిగారి ప్రీతం చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకోవడం జరిగింది. అలాగే ఇందిరా భవన్ లో జరిగిన సదస్సులో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, జాతీయ సమన్వయకర్త కొప్పుల రాజు, పదిహేను రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్న సదస్సులో సికింద్రాబాద్ జిల్లా పక్షాన పాల్గొనడం జరిగింది. తనను జిల్లా అధ్యక్షునిగా నియమించిన రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆదం సంతోష్ కుమార్ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జి మరియు కంటెస్టెడ్ ఎమ్మెల్యే , దీపక్ జాన్ డీసీసీ ప్రెసిడెంట్, చైర్మన్ తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, నాగులూరి సాయి బాబా డీసీసీ కోశాధికారి కు కృతజ్ఞతలు తెలిపారు. నేటి నుండి సికింద్రాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగాన్ని బలోపేతం చేసి రానున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపులో ఎస్సీ విభాగం పాత్ర ఉండే విధంగా పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానని అన్నారు

# ముస్తాబాద్ లో రోడ్డెక్కిన రైతులు

**రోహిణి కార్తె వచ్చిన కొనుగోలు కేంద్రాల జాప్యం వల్ల ఇబ్బంది పడుతున్న రైతులు**

మేకార్తి దినపత్రిక మే 27 ముస్తాబాద్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని కొనుగోలు కేంద్రాలలో నెలలు గడుస్తున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్త నడకన సాగుతున్నాయని ప్రధాన కూడలి గల రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ముస్తాబాద్ రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాశులు కుప్పలు కుప్పలుగా నిలిచిపోయిన రాశులు ఉన్నాయని సరైన టైం కు లారీలు రాక కొనుగోలు ప్రక్రియలో జాప్యం వల్ల రైతులు త్రివ ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. శ్రమించిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తరలించక దిక్కు తోచని స్థితిలో రైతులు దిక్కు దిక్కుమంటూ గడుపుతున్నారని, త్వరగా ఐకేపికేంద్రాలలో కొనుగోలు చేయక ఒకవైపు అకాల వర్షంతో ధాన్యం తడుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు అధికారులు ఒక్కసారి కొనుగోలు కేంద్రాలకు వచ్చి చూస్తే రైతుల పరిస్థితి అర్థం అయితదని రైతులు అన్నారు. ఇక్కడ రైతులు పాల్గొన్నారు.

# 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువు విత్తనాల పంపిణీ!



మేకార్తి దినపత్రిక మే 27 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

కొమురవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువు జనుము మరియు జీలుగా విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి క్లస్టర్ ఏఈవో రవళి మరియు మర్రిముచ్చాల క్లస్టర్ ఏఈఓ భాస్కర్ రెడ్డి రైతుల ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను పరిశీలించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేసి పర్మిట్ స్లిప్పులను పంపిణీ చేశారు. అనంతరం రైతులు ఆగ్రోస్ సెంటర్‌లో సబ్సిడీ విత్తనాలను పొందే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం ద్వారా భూమి సారవంతత పెరిగి దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా జనుము విత్తనాలు 40 కిలోల బ్యాగ్ రూ. 3110 ధర కాగా, జీలుగా విత్తనాలు 30 కిలోల బ్యాగ్ రూ. 2452 ధరతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కేంద్రాలను పరిశీలించిన

- మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సబేర బేగం గౌస్
- రైతులు అధైర్య పడవద్దు

మేకార్తి దినపత్రిక మే 27 ఎల్లారెడ్డిపేట మండల రిపోర్టర్



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిన్న కురిసిన వర్షం లో తడిసిన వడ్లను, ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేర బేగం గౌస్ మాట్లాడుతూ ఐకెపి మరియు ప్యాక్ సెంటర్లోని తడిసిన ఉన్న వడ్లను పరిశీలించి మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు ఇది ప్రజా ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తుందని ఐకెపి తో పాటు ప్యాక్స్ సెంటర్లలో ఉన్న వడ్లను తొందరగా గోడౌన్లోకి తరలించాలని జిల్లా అధికారులతో మాట్లాడడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాటి రాంరెడ్డి, నారాయణపూర్ సర్పంచ్ దొమ్మటి నర్సయ్యా, తిమ్మాపూర్ ఉప సర్పంచ్ జజ్జరి దేవేందర్, ఏఎంసీ డైరెక్టర్లు కృష్ణారెడ్డి, మెండే శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా ఉప అధ్యక్షులు మర్రి శ్రీనివాస్,అనవేని రవి,బుచగౌడ్,షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు, తరలింపులో వేగం పెంచాలి

- వాహనాలు, హమాలీల సంఖ్యను పెంచాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ధాన్యం కొనుగోళ్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్

మేకార్తి దినపత్రిక మే-27 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపులో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, మిల్లులు, గోదాంలలో అన్ లోడింగ్ వేగవంతం చేసి నిల్వ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు



కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ బుధవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు, మిల్లుల్లో అన్ లోడింగ్ పై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. మిల్లుల వారీగా లక్ష్యం మేరకు ధాన్యం అన్ లోడింగ్ చేయాలని స్పష్టం చేశారు. కొనుగోళ్ల శాతం పెరిగేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న బస్తాలను వెంటనే మిల్లులు, గోదాములకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గన్నీ బ్యాగులు, కొనుగోలు కేంద్రాల్లో చేస్తున్న ట్యాబ్ ఎంట్రీ, తదితర వివరాలు ఆరా తీశారు. కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి వాహనాలు, హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు.సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్లు సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# చుంచనకోటలో ఘనంగా వెకేషన్ బైబిల్ స్కూల్ (ఎదీూ) కార్యక్రమాలు.

- పిల్లల్లో ఆధ్యాత్మిక చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపు.

మేకార్తి దినపత్రిక మే 27 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



చేర్యాల మండలం, చుంచనకోట గ్రామంలోని 'లార్డ్ ఆఫ్ కింగ్స్ జీసస్ లవ్ మి చర్చ్' నందు వెకేషన్ బైబిల్ స్కూల్ (ఎదీూ) కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు యేసయ్య గురించి, ఆధ్యాత్మిక వాక్య భాగాలను బోధించారు. చిత్రపటాలు, చేతిపనులు మరియు రంగులు వేయడం లాంటి సృజనాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలలో మంచి చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన అర్హులైన పిల్లలకు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఇటువంటి స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలను భవిష్యత్తులోనూ జరిపించాలని కోరుతూ, స్థానిక పాస్టర్ రెవ జి. ఎలిజా ఉదయ్ పాల్ ని మనస్ఫూర్తిగా అభినందించారు.ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు, సంఘ పెద్దలు: బి. యాదగిరి, కె. బాలరాజ్.?2వ వార్డ్ మెంబర్: కె. కవిత అసిస్టెంట్ పాస్టర్: జి. డానియెల్ పాల్ (ఉమేష్) , జి. జోసెఫ్ రాజ్, యవ్వనస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

- చట్టం పరిచయం- నేపథ్యం

మేకార్తి దినపత్రిక, మే 27 కోరుట్ల టౌన్ రిపోర్టర్ సాంబార్ మహేష్



బుధవారం రోజున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి-ప్రణాళికలో భాగంగా బుధవారం రోజు ఐలాపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీల దగ్గరికి వెళ్లి పనిచేసే ప్రదేశాలలో లైంగిక వేధింపుల నివారణ, చట్టపరమైన బాధ్యతలకు సంబంధించి కూలీలకు (పి ఓ ఎస్ హెచ్) చట్టం 2013 పై అవగాహన కల్పించడం జరిగింది ప్రభుత్వ ప్రైవేటు అసంఘటిత రంగాలలోని అన్ని సంస్థలకు ఎక్కడ పని చేసే లేదా ఆఫీసులకు పనిమీద వచ్చే ప్రతి మహిళకు వయసుతో సంబంధం లేకుండా ఈ చట్టం రక్షణ కల్పిస్తోంది అని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐలాపూర్ గ్రామ సర్పంచ్ రామకృష్ణ,ఉపసర్పంచ్ సౌమ్య, కార్యదర్శి నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రవీణ్, అంగన్వాడీ టీచర్లు కాలేశ్వరి,మంజుల, శైలజ,విమల, భాగ్యలక్ష్మి, సుజాత,సుమతి, ఉపాధి హామీ వర్కర్లు పాల్గొన్నారు...

# కొనుగోళ్లు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



మేకార్తి దినపత్రిక మే 27 గంభీరావుపేట మండల రిపోర్టర్

తుది దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీచేశారు.ఇప్పటివరకు ఈ కేంద్రంలో ఎంత ధాన్యం సేకరించారు? ఎంత వరకు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశారు అనే వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ ఆరా తీయగా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, తూకం వేసిన బస్తాలను మిల్లుకు వాహనాల ద్వారా తరలిస్తున్నామని కలెక్టర్ కు వివరించారు. తూకం వేసిన బస్తాలను జాప్యం చేయకుండా కొనుగోలు కేంద్రాల నుండి తరలించాలని కలెక్టర్ సూచించారు. ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముందుగానే టార్పాలిన్లు సరిపడా అందుబాటులో పెట్టుకోవడం ద్వారా వర్షాలకు ధాన్యం తడవకుండా ఉంటుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లుకు తరలించిన అనంతరం మిల్లులో అన్ లోడింగ్ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. సన్న రకాల సాగుపై దృష్టి సారించాలని రైతులను కోరారు. తనిఖీలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, గ్రామ సర్పంచ్ గంగ సాయవ్వ రాజారాం. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, తదితరులు ఉన్నారు.

# కొత్తపల్లి గ్రామంలోని విద్యుత్ సమస్యలపై ఏఈ కి వినతిపత్రం

మేకార్తి దినపత్రిక మే 27 గంభీరావుపేట మండల రిపోర్టర్



గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామం లోని పలు విద్యుత్ సమస్యల గురించి సంబధిత ~ాజు గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది గ్రామం లోని కేబుల్ సమస్య మరియు పలు వార్డు లలో పోల్స్ ఉన్న కండక్టర్ లేకపోవడం అదే విధంగా కొన్ని వార్డ్ లలో పోల్స్ లేకపోవడం వాటి గురించి తెలియజేయడం జరిగింది గ్రామం లో ప్రధానంగా డిపార్ట్మెంట్ కి సంబంధించిన అసిస్టెంట్ హెల్పర్ లేకపోవడం వలన విద్యుత్ సరఫరా కి అంతరాయం జరిగినప్పుడు ఇబ్బంది గా మారుతుంది గ్రామం లోని లూస్ పోల్స్ సమస్య ల పైన ఈ రోజు ~ాజు గారిని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది వారు సానుకూలంగా స్పందించి త్వరితగతిన సమస్యలను పరిష్కారం చేస్తా అని స్పందించడం జరిగింది ఇట్టి కార్యక్రమం లో గ్రామస్థులు బీనమైన శ్రావణ్ గుర్రం రాజు మెడ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# కాలిపోయిన ఈత చెట్ల వనాలకు తక్షణ నష్టపరిహారం అందించాలి..

మేకార్తి దినపత్రిక,మే - 27 కోరుట్ల టౌన్ రిపోర్టర్ సాంబార్ మహేష్



రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజవర్గ నాయకులు డాక్టర్ యాచమనేని అనూప్ రావు ఇటీవల కోరుట్ల మండల సంగెం గ్రామం అలాగే మెట్ల చిట్టాపూర్ గ్రామంలో కాలిపోయిన ఈత వనం లను ఇందూర్ పార్లమెంట్ సభ్యులు ధరంపురి అరవింద్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు తో కలిసి గీతా కార్మికులను పరామర్శించిన అనూప్ రావు. ఈ సంఘటనాల వల్ల స్థానిక ఈత కార్మికులు, వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గౌడ కుటుంబాలను ఆదుకోవాలని సంబంధిత అధికారులతో తక్షణమే నష్టపరిహార అంచనా వేయించి గౌడ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునర్వతం కాకుండా అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈటీ కార్యక్రమంలో కోరుట్ల మండల బిజెపి ప్రధాన కార్యదర్శి విట్టల్ రాజేందర్ రెడ్డి బిజెపి సీనియర్ నాయకులు తుకారాం గౌడ్, అంబల్ల సుదర్శన్, సంకు నరేందర్, బొలిశెట్టి రాజేందర్, మెట్ పల్లి మండలం అధ్యక్షుడు రాజ్ పాల్ పాల్గొన్నారు.

# రోడ్డుపై రైతుల ధర్నా...

చందుర్తి, మే 27, మేకార్తి దినపత్రిక ప్రతినిధి :



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లోని మల్యాల గ్రామంలో వరి కొనుగోళ్ల విషయంలో గత రాత్రి జరిగిన వర్షం కురవడం వల్ల వడ్లల్లోకి నీరు చేరడం వల్ల వడ్లు తడిసిపోయినాయి అందువలన రైతులు తీవ్ర నిరసన చేసి రోడ్డుపై ధర్నా నిర్వహించారుతెలియజేశారు. గ్రామస్తులు తెలియజేస్తూ రైతుల వడ్లు కొనుగోలు చేస్తలేరు అని ఎక్కడికక్కడ వడ్ల కుప్పలు అక్కడే ఉన్నాయి లారీలు వస్తలేవు లారీలలో పంపించిన వడ్లను రైస్ మిల్లు యజమానులు మిల్లులలో దించుకుంటలేరని రైతులు వాపోయారు.స్థానిక ఎమ్మార్వో భూపతి,మరియు చందుర్తి స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్,ఏపీఎం ఐకెపి వాళ్లు కలిసి సమస్యను పరిష్కరిస్తామని పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు

13

# ఐఎంఎస్ భవన పనుల్లో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనుల పరిశీలన

మేకార్తి దినపత్రిక,మే - 27 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



జిల్లా ఇందిరా మహిళా శక్తి (ఐఎంఎస్) భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెడికల్ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి (ఐఎంఎస్) భవన నిర్మాణ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అన్ని గదులు పరిశీలించి.. ఎప్పటిలోగా పూర్తి అవుతాయో ఆరా తీశారు. పనుల పురోగతిని నిత్యం పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భవన పనులను వచ్చే నెల జూన్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.పరిశీలనలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ మహేష్ కుమార్, పీఆర్ డీఈఈ శ్రీనివాస్, ఏఈ సతీష్ తదితరులు ఉన్నారు.

# దుబాయ్‌లో వేలాది మందికి ఉపాధి కల్పించిన ఆకుల నరేష్‌కు ఘన నివాళి

**– అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

వేములవాడ, మే 27, మేకార్తి దినపత్రిక ప్రతినిధి

వేములవాడ పట్టణానికి చెందిన ప్రముఖ మాజీ ప్రవాస వ్యాపారవేత్త ఆకుల నరేష్ కుమార్ అకాల మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. దుబాయ్‌లో ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి అనేక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన నరేష్ కుమార్ ఇటీవల కేదార్నాథ్ యాత్రలో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం వేములవాడలో నిర్వహించిన ఆయన అంత్యక్రియల్లో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ఆయన భౌతిక కాయానికి ఘనంగా నివాళు లర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని



భగవంతుణ్ణి కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆకుల నరేష్ సాధారణ కార్మికుడిగా గల్ఫ్ జీవితాన్ని ప్రారంభించి తాను కష్టపడి పనిచేసే తత్వంతో ఉన్నతమైన స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. దుబాయ్‌లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వాన్ని అందించిన గొప్ప మనసున్న వ్యక్తి అని కొనియాడారు. యువతకు మార్గదర్శకుడిగా నిలిచిన నరేష్ సేవలు చిరస్మరణీయమన్నారు. నరేష్ మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న అనేక కుటుంబాలకు తీరని లోటని దిగ్భ్రాంతినీ వ్యక్తం చేశారు. జీవితంలో పుట్టుక,మరణాలు సహజమని మనకు దూరమైన వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా వారికి నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అంత్యక్రియల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు కుమ్మరి శంకర్,ఇప్పపూల అజయ్, నాయకులు మదాడి గజానంద రావు,ఏనుగు మనోహర్ రెడ్డి,కొండ దేవయ్యతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు,పట్టణ ప్రముఖులు,జర్నలిస్టులు,కుటుంబ సభ్యులు,భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని ఆకుల నరేష్‌కు చివరిసారిగా కన్నీటి వీడ్కోలు పలికారు.

# జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి.

మేకార్తి దినపత్రిక మే 27 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.




భారత తొలి ప్రధాని స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా చేర్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు దాసరి శ్రీకాంత్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజె మల్లేశం, సీనియర్ నాయకులు,కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నామినేటెడ్ డైరెక్టర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం

**– రాష్ట్ర నాయకులు గరిపల్లి ప్రభాకర్**
**– మండల అధ్యక్షులు కోడె రమేష్**
**– మండల మహిళా అధ్యక్షురాలు జమున**

మేకార్తి దినపత్రిక మే 27 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం.భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేశ్ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ మరియు( బి ఎల్ ఎ )2 మండల సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథిగా గరిపెల్లి ప్రభాకర్ గారు విచ్చేసి మాట్లాడుతూ కార్యకర్తలు ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించే నాయకుడు దేశాభివృద్ధి, రాష్ట్ర ప్రగతికి అంకితమైన దృక్పథం క్రమశిక్షణ, నిబద్ధత, సేవాభావం కలిగిన వ్యక్తిత్వం బలమైన నిర్ణయాలు తీసుకుని మార్పు తీసుకువచ్చే శక్తి చూపిన మార్గంలో నడుచుకుంటూ, ప్రజల కోసం కృషి చేయాలి. ఇది కేవలం గౌరవం మాత్రమే కాదు -- ఒక బాధ్యత, ఒక కర్తవ్యంగా ప్రతి కార్యకర్త తీసుకోవాలి అన్నారు. సేవ, నమ్మకం, అభివృద్ధి ఇదే బీజేపీ సిద్ధాంతమన్నారు. బి ఎల్ ఏ -2 ( బూత్ లెవెల్ ఏజెంట్)ఈ సమావేశం ప్రధానంగా బూత్ స్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణలో సమన్వయం పెంచడం కోసం ఏర్పాటు చేయబడుతుంది. బి ఎల్ ఏ -2 ముఖ్య ఉద్దేశాలు ప్రతి బూత్‌లో పార్టీకి ఉన్న బలహీనతలు, బలాలను గుర్తించడం ఓటర్ల జాబితాను పరిశీలించి, తప్పులు సవరించడం కొత్త ఓటర్ల నమోదు ( ఎన్రోల్మెంట్) పై దృష్టి పెట్టడం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం బూత్ స్థాయి కార్యకర్తలతో సమన్వయం పెంపొందించడం సమావేశంలో బూత్ వారీగా ఓటర్ల వివరాలు గత ఎన్నికల విశ్లేషణ సోషల్ మీడియా వినియోగం ద్వారా ప్రచారం చెయ్యడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతిపక్షాల తప్పులను ప్రజల్లో బహిర్గతం చేయాలని ప్రతి కార్యకర్త తన బూత్‌లో కనీసం 20-30 కుటుంబాలను సంప్రదించాలి కొత్త ఓటర్లను నమోదు చేయించాలి పార్టీపై నమ్మకం పెంచే విధంగా ప్రజలతో మాట్లాడాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలను , విజయాలను ప్రజలకు వివరించాలి బి ఎల్ ఎ -2 సమావేశంలో



మండల అధ్యక్షులు రమేశ్ మాట్లాడుతూ ప్రతి నాయకుడు కార్యకర్త బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ, వచ్చే ఎన్నికల్లో విజయాన్ని సాధించడానికి పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ప్రతి కార్యకర్త ఈ సమావేశంలో చురుకుగా పాల్గొని పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ నాయకులు నర్సింలు గణేష్ రెడ్డి జమున బండ దేవయ్య పత్తి స్వామి సర్వోత్తమ్ నాగరాజుగౌడ్ దేవేందర్ గౌడ్ రవీందర్ స్వామి సత్యం శ్రీనివాస్ చారి నర్సింలు మధు పూల్యా నాయక్ మల్లేష్ గౌడ్ దేవేందర్ యాదవ్ శ్రీనివాస్ చంద్రం యాదవ్ రాజేష్ చారి నరేష్ నాయకులు పాల్గొన్నారు

# లూజ్ వైర్ సరి చేయాలని ఏఈకి వినతి పత్రం

మేకార్తి దినపత్రిక మే 27 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఎస్సీ కాలనీలోని పలు ఇండ్లపై నుండి కరెంటు వైర్లు ఉన్నవి అవి లూజుగా ఉండి వర్షాకాలం గానీ గాలి దుమారం పెట్టినప్పుడు వైలు తెగిపోవడం కాలనీలో కరెంట్ పోవడం జరిగింది దాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడైనా సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు ఎన్నోసార్లు గతంలో ఉన్న ఎఈ కి మరియు సిస్ సిబ్బందికి చెప్పిన పట్టించుకోవడంలేదని అవి సరిచేయాలని ఎస్సీ కాలనీ దృష్టిలో పెట్టుకొని తొందరగా లూస్ వైరు సరిచేయాలని ఏఈ గారికి స్థానిక మాజీ వార్డ్ సభ్యులు మరియు జిల్లా అంబేద్కర్ సంఘాల ఉపాధ్యక్షులు బండ రమేష్ కోరారు

# తెలుగుదేశం పార్టీ వర్చువల్ మహానాడు ను విజయవంతం చేద్దాం.

మేకార్తి దినపత్రిక,మే -27 కోరుట్ల టౌన్ రిపోర్టర్ సాంబార్ మహేష్



తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ కార్యాలయంలో మే 27,28 తేదీలలో దేగాం యాదగౌడ్ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహించే వర్చువల్ మహానాడు కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గంలోని వివిధ మండలాల టిడిపి నాయకులు, సీనియర్ నాయకులు,తెలుగుదేశం పార్టీ క్రియాశీల కార్యకర్తలు, పార్టీ అభిమానులు, తెలుగు యువత,తెలుగు మహిళా నాయకురాలు, ఎన్టీఆర్ అభిమానులు,అందరం కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం ధచేద్దామని అలాగే,అందరూ తమ యొక్క పార్టీ సభ్యత్వం కార్డు తీసుకొని రాగలరని కోరుట్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, జిల్లా ఎన్టీఆర్ ఓల్డ్ అభిమాన సంఘ అధ్యక్షులు మానుక ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# ' జస్టిస్ ' కేజీ బాలకృష్ణన్ కి తన నివేదికను సమర్పించిన ' పద్మశ్రీ ' మంద కృష్ణ మాదిగ.

మేకార్తి దినపత్రిక మే 27 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే అంశంపై అధ్యయనం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం చేత నియమించబడినటువంటి ప్రత్యేక కమిటీ చైర్మన్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కి న్యూఢిల్లీలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ' పద్మశ్రీ ' మందకృష్ణ మాదిగ తన నివేదికను సమర్పించడం జరిగింది. 200 పైగా పేజీలతో కూడిన ఈ నివేదికలో దళిత క్రైస్తవులకు సంబంధించిన విద్యా,వైద్య, సామాజిక ,సాంస్కృతిక , ఆర్థిక పరిస్థితులను పేర్కొంటూ వారికి ఎస్సీ హోదా మరియు రాజ్యాంగ హక్కులను కల్పించాలని కమిటీకి వీ౹రూా తరుపున విజ్ఞప్తి చేశారు. అలాగే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు మరియు సామాజిక వివక్షత , రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ఇతర అంశాలు ,కుల వ్యవస్థ ప్రభావం మొదలగు అంశాలను ఈ నివేదికలో పొందుపరిచి సుదీర్ఘ కాలంగా నలుగుతున్న సమస్య పరిష్కారం కోసం కమిటీ ముందు కొన్ని ప్రతిపాదనలు పెట్టడం జరిగింది.

# ఈదురుగాలులకు ఇళ్ల రేకులు ఎగిరిపాటు.. బాధితుల ఆవేదన

మేకార్తి దినపత్రిక( మే 27) గన్నేరువరం మండలం ప్రతినిధి



గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి గ్రామంలో సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గ్రామానికి చెందిన బామాండ్ల రజిత-మల్లేష్, బామాండ్ల చంద్రయ్య-వీరమల్లయ్య కుటుంబాలకు చెందిన ఇళ్ల రేకులు భారీ గాలులకు ఎగిరిపడి కిలోమీటర్ల దూరం వరకు కొట్టుకుపోయాయి. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోని సామగ్రి కూడా దెబ్బతినడంతో బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. తాము తీవ్ర నష్టపోయామని, ప్రభుత్వం మరియు అధికారులు వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

# ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం నేలరాలిన మామిడి ఆందోళనలో రైతులు.

మేకార్తి దినపత్రిక మే 27 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరులో ఐకెపి, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసి ముద్దయిన వడ్లను పరిశీలించారు. వెంటనే బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతులు సూర రాజు, బైకని యాదయ్య, రేసు పావని తదితరులు పాల్గొన్నారు.

# 4వ మహాసభల లోగోను ఆవిష్కరించిన సిపిఐ నాయకులు

మేకార్తి దినపత్రిక, మే. 27 కోరుట్ల "రిపోర్టర్"(సాంబార్ మహేష్)

ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా ఆహ్వాన సంఘం రూపొందించిన లోగో ను కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్,ఆహ్వాన సంఘం అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్,టేకుమల్ల సమ్మయ్య,కోశాధికారి కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఏఐటియుసి జిల్లా నాయకులు అందరూ తదితరులు పాల్గొని ఆవిష్కరించారు.



# ముదిరిన డాన్-3 వివాదం
## రణ్‌వీర్‌పై సినీ ఎంప్లాయిస్ నిషేధం




'ధురంధర్' రెండు భాగాలతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుని కొన్ని రోజులుగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌వీర్. ఇప్పుడు ఆయన మరోసారి వార్తల్లో నిలిచారు. కొన్ని రోజులుగా చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం ఇప్పుడు ముదిరింది. ఏకంగా ఈ అగ్ర హీరోపై బ్యాన్ విధించే పరిస్థితికి వచ్చింది. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ తర్వాత డాన్ పాత్రను పోషించాల్సిన రణ్‌వీర్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) మూడేళ్ల పాటు నిషేధం విధించింది. దీంతో ఆయన హాట్ టాపిక్‌గా మారారు. 2023లో ఫర్హాన్ అక్తర్ ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3'ని అధికారికంగా ప్రకటించింది. అప్పుడే ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి పెద్ద సంచలనం సృష్టించింది. అయితే సినిమా తీయడంలో కొంత ఆలస్యం కావడం.. స్క్రిప్ట్‌లో సమస్యలు తలెత్తడంతో రణ్‌వీర్ ఈ చిత్రం నుంచి వైదొలిగినట్లు వార్తలు వచ్చాయి. రణ్‌వీర్ తన డాన్ పాత్రను మరింత డార్క్, హింసాత్మకంగా చూపించాలని కోరుకున్నట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఫర్హాన్ అక్తర్ పాత్రను మార్చడానికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. షూటింగ్ షెడ్యూల్ ఆలస్యం కావడంతో రణ్‌వీర్ అసహనం వ్యక్తంచేస్తూ ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగినట్లు బాలీవుడ్ కథనాలు పేర్కొన్నాయి. 'డాన్ 3' నుంచి తాను వైదొలిగిన తర్వాత దర్శకుడు ఫర్హాన్ అక్తర్‌కు రణ్‌వీర్ రూ. 10కోట్లు ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అలాగే తన తదుపరి చిత్రం 'ప్రళయ్'లో అక్తర్ నిర్మాణసంస్థకు వాటా ఇవ్వడానికి కూడా ఈ హీరో అంగీకరించారని టాక్ వినిపించింది. అయితే దీనిపై ఎవరూ అధికారికంగా స్పందించలేదు. ఒకవైపు ఈ వార్తలు వస్తోన్న తరుణంలోనే ఈ వివాదంపై ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్‌పై రూ. 45 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు జారీ చేసింది. దీంతో 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) రణ్‌వీర్‌పై మూడేళ్లు నిషేధం విధించింది. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ. 45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకు ఆయనతో కలిసి పనిచేయవద్దని పరిశ్రమని ఆదేశిస్తూ 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ' ప్రకటన జారీ చేసింది. సినిమాలు కీలక దశలో ఉన్నప్పుడు సీనియర్‌లు, స్టార్‌లు ప్రాజెక్టల నుంచి వైదొలగడం వినోద పరిశ్రమ స్థిరత్వానికి.. పని వాతావరణానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ పేర్కొంది. అయితే, ఇది ప్రభుత్వం విధించిన నిషేధం కాకపోవడంతో రణ్‌వీర్‌పై పెద్దగా ప్రభావం పడదని సినీవర్గాలు భావిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై రణ్‌వీర్ టీమ్ స్పందించింది. 'ఆయన తన వృత్తిని ఎంతో గౌరవిస్తారు. 'డాన్ 3' విషయంలో జరుగుతోన్న పరిణామాలపై ఆయన స్పందించకపోవడానికి కారణం ఇదే. ఊహాగానాలకు ఆజ్యం పోయడం ఆయనకు ఇష్టం లేదు' అని టీమ్ పేర్కొంది. డాన్ 3లో భాగమైన ప్రతిఒక్కరినీ ఆయన ఎంతో గౌరవిస్తారని తెలిపింది. ఈ బ్యాన్ ఆయన భవిష్యత్ ప్రాజెక్టులపై ఎంత ప్రభావం చూపుతుందనేది ఆసక్తిగా మారింది.

# చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే
## ..సెకండ్ సింగిల్ విడుదల




నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స్ అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవెంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్స్‌ను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది. తల్లి మరణంతో కొంతకాలం తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె, ఆ తర్వాత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరాలు అందిస్తున్నారు.



# బుచ్చిబాబు కోసం పెద్దిలో నటించా: దివ్యేందు

'పెద్ది' డైరెక్టర్ బుచ్చిబాబుపై ప్రశంసలు కురిపించారు బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ. ఆయన కోసమైనా 'పెద్ది' చేయాలని అనుకున్నట్లు చెప్పారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రం 'పెద్ది'. ఇందులో దివ్యేందు శర్మ కీలక పాత్రలో నటించారు. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా దివ్యేందు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సినిమా అంగీకరించడానికి కారణం వెల్లడించారు. తాను ఉత్తరాఖండ్‌లో షూటింగ్‌లో ఉన్నప్పుడు ఈ చిత్ర బృందం నుంచి ఫోన్ వచ్చింది. వీలున్నప్పుడు వస్తాను అని చెప్పా. తర్వాత 'మిమ్మల్ని కలవాలి' అని బుచ్చిబాబు చాలా మెసేజ్‌లు పెట్టారు. దీంతో నేను ఆ షూట్ మధ్యలోనే ఆపేసి ఎంతోసేపు ప్రయాణించి చాలా కష్టపడి అక్కడినుంచి ఇక్కడికి వచ్చాను. బుచ్చిబాబును చూసి ఆశ్చర్యపోయాను. ఎంతో ప్రేమతో వ్యవహరించారు. కళకు ఎంత గౌరవం ఇస్తారో చూశాను. నా పాత్రను వివరించేటప్పుడే నిర్ణయించుకున్నా. ఈ సినిమా ఎలా ఉన్నా బుచ్చిబాబు కోసం చేయాలి అని. వెంటనే ఓకే చేశా. ఆయన నన్ను అంత ప్రభావితం చేశారు' అని దివ్యేందు తెలిపారు. ఇక పెద్ది కథ గురించి మాట్లాడుతూ..'స్టోరీ చూసి షాక్ అయ్యాను. ఎంత గొప్పగా రాశారో అనుకున్నా. ఎన్నో ట్విస్ట్‌లు, గొప్ప గొప్ప పాత్రలు ఉన్నాయి. గుర్తింపు కోసం ఎంత యుద్ధమైనా చేయొచ్చని ఈ సినిమా చూశాక అర్థం అవుతుంది. 'పెద్ది' తన గుర్తింపు కోసం ఎంతో పోరాడతాడు. ఆ అంశం నాకు చాలా నచ్చిందని చెప్పారు.


# సిఎం విజయ్‌తో లోకేశ్ కనగరాజ్ భేటీ



తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కజగం అధినేత, దళపతి విజయ్‌ను ప్రముఖ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు ఆయన స్వయంగా కలిసి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్‌తో దిగిన ఫొటోను షేర్ చేసిన లోకేష్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ అన్నా నీకు శుభాకాంక్షలు అంటూ లోకేష్ రాసుకొచ్చాడు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'మాస్టర్', 'లియో' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌లుగా నిలిచిన సంగతి తెలిసిందే. కేవలం దర్శకుడిగానే కాకుండా విజయ్‌తో లోకేష్‌కు ఎంతో కాలంగా మంచి ఆత్మీయ అనుబంధం ఉంది.

# 17 ఏళ్ల తర్వాత ఆ ప్రయోగం..
## 'పెద్ది' కథను మలుపు తిప్పే మ్యాచ్ అది!

దాదాపు 17 ఏళ్ల తర్వాత 'పెద్ది'లో దిల్లీ ఎపిసోడ్ కోసం మళ్లీ ఫిల్మ్ నెగటివ్‌ను ఉపయోగించామని సినిమాటోగ్రాఫర్ రత్నవేలు తెలిపారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీకపూర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఆసక్తికర విశేషాలను రత్నవేలు పంచుకున్నారు.




### అవన్నీ రీ క్రియేట్ చేశాం..

"పెద్ది' దాదాపు 40 ఏళ్ల క్రితం విజయనగరంలో జరిగే కథ. ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. కానీ, ఒకప్పటి విజయనగరానికి ప్రేక్షకులను తీసుకెళ్లాలి. అదంతా ఒక ఊహా ప్రపంచం. రిఫరెన్స్ కోసం కొన్ని ఇమేజెస్ తీసుకుని, 'పెద్ది' కథను ఎలా చెప్పాలి? విజువల్‌గా ఎంత అందంగా క్రియేట్ చేయాలనే దానిపై చాలా పకడ్బందీగా వర్క్ చేశాం. క్లాక్ టవర్, వీధులు, షుగర్ ఫ్యాక్టరీ ఇలా ఒక్కో అంశాన్ని వరల్డ్ బిల్డింగ్ చేస్తూ వెళ్లాం. కొండ ప్రాంతాలు, అక్కడి ప్రజలు, వారి లైఫ్ స్టయిల్ ఇలా ప్రతిదీ చాలా సహజంగా ఉంటుంది"

### కథను మలుపు తిప్పే మ్యాచ్..

"పెద్ది'లో నాకు అత్యంత కష్టంగా అనిపించింది క్రికెట్ మ్యాచ్. ఇది స్పోర్ట్స్ బేస్డ్ సినిమా. కెమెరామెన్‌తో పాటు మొత్తం టీమ్ చాలా జాగ్రత్తగా ఉండాలి. సినిమాలో వచ్చే సెకండ్ క్రికెట్ మ్యాచ్ చాలా కీలకం. అది కేవలం మ్యాచ్ మాత్రమే కాదు, కథలోనే ఒక పెద్ద మలుపు. ఆ మ్యాచ్‌ను రాత్రిపూట షూట్ చేద్దామని బుచ్చిబాబు గారికి సూచించాను. 80లలో ఫ్లడ్‌లైట్ మ్యాచ్‌లు జరిగేవి. ఆ మూడ్ కోసం నైట్ షూట్ అయితే బాగుంటుందని అనిపించింది. ఆయనకు ఆ ఆలోచన నచ్చింది"

### హనుమంతుడి రెఫరెన్స్..

"అలాగే కుస్తీ పోటీలు కూడా మరో పెద్ద ఛాలెంజ్. ఒక గెటప్ అనుకున్న తర్వాత కాస్ట్యూమ్స్, బాడీ మార్చుకుంటే సరిపోతుంది. కానీ, ఇందులో రామ్ చరణ్ కుస్తీ విషయానికి వచ్చేసరికి తన బాడీలోని ప్రతి మజిల్‌పై వర్క్ చేశారు. ప్రతి మజిల్‌ను డెవలప్ చేసి, ఒక రియల్ పహిల్వాన్‌లా కనిపించారు. హనుమంతుడి రిఫరెన్స్‌తో వచ్చే ఒక సీక్వెన్స్ ఉంది. ఆ సీక్వెన్స్‌లో ప్రత్యేకమైన లైటింగ్ డిజైన్ చేశాను. అది మీరు థియేటర్‌లో చూసినప్పుడు గూస్‌బంప్స్ వస్తాయి"

### చివరి 30 నిమిషాలు ప్రేక్షకుడిని కదలిస్తుంది..

"ఈ సినిమా క్లైమాక్స్ కూడా చాలా ఛాలెంజింగ్. ఇప్పుడే దాని గురించి ఎక్కువ చెప్పకూడదు. అది ప్రేక్షకులకు కన్నుల పండుగలా ఉంటుంది. విజువల్ గ్రాండియర్‌తో పాటు ఎమోషనల్ హై కూడా ఉంటుంది. చివరి 30 నిమిషాలు సినిమా ప్రేక్షకులని కదిలిస్తుంది. చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు. ఇందులో దిల్లీలో చిత్రీకరించిన సన్నివేశాలు నాకు చాలా ఫేవరెట్. అక్కడ నేను లైట్ లేకుండా షూట్ చేశాను. దాని కోసం ఫిల్మ్ నెగటివ్‌ను వాడాం. దాదాపు 17 ఏళ్ల తర్వాత మళ్లీ ఫిల్మ్ నెగటివ్‌ను ఉపయోగించాను. ఇప్పుడు ఉన్న డిజిటల్ కెమెరాలు అద్భుతమైన ఔట్‌పుట్ ఇస్తున్నప్పటికీ, ఒక రియల్ ఫీల్ కోసం వాడాం"

### మంచి యాక్షన్ థ్రిల్లర్ తీస్తా!

"నేను ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు 30 సంవత్సరాలు అయ్యింది. ఏడాదికి ఒక సినిమానే చేస్తాను. ఒక సినిమా కమిట్ అయితే అది పూర్తయ్యే వరకు వేరేవి చేయను. ఇప్పటికే మూడు కథలు రాశాను. మంచి ఎమోషన్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌ను డైరెక్ట్ చేయాలనుకుంటున్నాను. అలాగే ప్రతి పాత్ర కూడా కథలో ఇంపార్టెంట్‌గా ఉండాలి. మా అబ్బాయి కూడా కెనడాలో సినిమాటోగ్రఫీ చదువుకున్నాడు. నాలాగే తనకూ సినిమాపై చాలా ప్యాషన్. 'పెద్ది'లో ఒక కుస్తీ ఫైట్ అద్భుతంగా షూట్ చేశాడు" అని అన్నారు.



# విశ్వంభర విడుదల తేదీపై అస్పష్టత
## మెగా ఫ్యాన్స్‌లో గందరగోళం

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. మెగాస్టార్ అభిమానులను ఎక్కువగా కలవరపెడుతున్న విషయం మాత్రం 'విశ్వంభర' మూవీ గురించే. ఎందుకంటే ఈ ప్రాజెక్ట్ చాలా కాలం క్రితమే ప్రారంభమై, షూటింగ్ కూడా పూర్తయిన దశకు చేరుకున్నప్పటికీ.. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత రాకపోవడం అభిమానుల్లో అనుమానాలు పెంచుతోంది. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న 'విశ్వంభర' మెగాస్టార్ కెరీర్‌లో అత్యంత భారీ ఫాంటసీ చిత్రాల్లో ఒకటిగా రూపొందుతోంది. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండియర్ సెట్స్, భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, సినిమా రిలీజ్ విషయంలో మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. మొదట ఈ సినిమాను సమ్మర్ రిలీజ్‌గా తీసుకురానున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే ఆ ప్లాన్ అమలు అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్లు కూడా లేకపోవడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'విశ్వంభర' ఆలస్యానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని టాక్ వినిపిస్తోంది. ఫాంటసీ జానర్ కావడంతో సినిమాకు భారీ స్థాయిలో అవసరం పడుతోంది. ముఖ్యంగా ఫాంటసీ జానర్‌లో వస్తున్న 'విశ్వంభర' పై మొదటి నుంచే ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కానీ వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవుతుండటం, 'విశ్వంభర'పై మాత్రం నిశ్శబ్దం కొనసాగడం ఫ్యాన్స్‌లో కొంత అసంతృప్తి పెంచుతోంది.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com